వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 280 సోమవారం | 20 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



## ఘనంగా గోలి రవి జన్మదిన వేడుకలు

వరంగల్ వాయిస్ డెస్క్ ఇంచార్జి గోలి రవి జన్మదిన వేడుకలను సోమవారం పత్రిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శాలువా కప్పి సన్మానించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, హనుమకొండ స్టాఫ్ రిపోర్టర్ సిద్దోజు రాకేష్,జర్నలిస్టు పూజారి విజయ్ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు 2లో..




# మేడారం సొమ్ము దేవాదాయ సోకు

### ధార్మిక భవన్ నుంచి మేడారం కార్యాలయం ఖాళీ చేయించేందుకు కుట్ర

### ప్రతిఘటిస్తున్న పూజారులు, భాగస్వామ్య వర్గాలు

### 29, 30 తేదీల్లో గద్దెల మూసివేత

### ప్రాంగణానికి తాళాలు వేసి, ధర్నా

ఇటేటు రమ్మంటే ఇల్లంతా నాదే అన్నట్టుగా ఉంది దేవాదాయ శాఖ పనితీరు. మేడారం సమ్మక్క-సారలమ్మ భవిష్యత్ అవసరాలను గుర్తించి 30 సంవత్సరాల క్రితం వరంగల్‌లోని ప్రైమ్ ఏరియాలో కేటాయించిన ప్రభుత్వ స్థలంలో నూతనంగా నిర్మించిన ధార్మిక భవన్‌లో మేడారం ఆనవాళ్లు కనిపించకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయి. గత సంవత్సరం దేవాదాయ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన ఈ ధార్మిక భవన్‌లో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం సమ్మక్క-సారలమ్మ కార్యనిర్వహణాధికారి కార్యాలయం, దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అయితే ధార్మిక భవన్ నుంచి మేడారం సమ్మక్క, సారలమ్మ కార్యాలయాలను ఖాళీ చేయించి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకునేలా అధికారులపై మంత్రులు, ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని మేడారం పూజారులు, భాగస్వామ్య వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. దేవాదాయ శాఖ కుట్రలను నిరసిస్తూ ఈనెల 29, 30 తేదీల్లో తల్లుల గద్దెల ప్రాంగణానికి తాళాలు వేసి, ధర్నా చేసేందుకు సిద్ధపడుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

8లో



## కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం.. శ్రీ మత్స్యగిరి స్వామి

### కాకతీయుల కళావైభవానికి ప్రతీక

### రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

2లో



## ఆ గురుతులు మరిచిపోలేం..

### ఇల్లందలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



## సీఎంను కలిసిన కడియం కావ్య

ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్ రెడ్డిని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛం అందజేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ

# మేడారం సొమ్ము.. దేవాదాయ శాఖ సోకు

**ధార్మిక భవన్ నుంచి మేడారం కార్యాలయం ఖాళీ చేయించేందుకు కుట్ర**

**ప్రతిఘటిస్తున్న పూజారులు, భాగస్వామ్య వర్గాలు**

**29, 30 తేదీల్లో గద్దెల మూసివేత**

**ప్రాంగణానికి తాళాలు వేసి, ధర్నా**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర భవిష్యత్ అవసరాలను పరిగణలోకి తీసుకొని 1993లో వరంగల్‌లోని కేంద్ర కారాగారానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. 1040 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఈ స్థలంలో ఏడాది క్రితం 'ధార్మిక భవన్'పేరుతో 'ఇంటిగ్రేటెడ్ ఎండోమెంట్స్ ఆఫీస్' నిర్మించారు. రూ. 4.60 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో ఈ నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ ధార్మిక భవన్ ను అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా 21 సెప్టెంబర్ 2023 ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అప్పటి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బి.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కార్యాలయాలు..

ధార్మిక భవన్ నిర్మాణానికి మేడారం నిధులతోపాటు నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయం, కాజీపేటలోని మెట్టుగుట్ట దేవాలయం నిధులు కేటాయించారు. ఇందులో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం సమ్మక్క–సారలమ్మ కార్యనిర్వహణాధికారి కార్యాలయం, దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా దేవాదాయ శాఖ ద్వారా మెరుగైన సేవలను అందించవచ్చని అందరూ భావించారు. మల్టీజోన్ పరిధిలోని 19 జిల్లాల పరిపాలన వ్యవహారాలు ఇక్కడి నుంచే కొనసాగించేవారు.



## మేడారం కార్యాలయం తరలించేందుకు కుట్ర..

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ములుగు జిల్లాలోని మేడారం మండలంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ జాతరకు కోటికిపైగా భక్తులు హాజరవుతున్నారు. ఏటాటా అమ్మవార్లను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గతంలో మాదిరిగా కాకుండా ప్రతీ రోజు సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారం వస్తున్న భక్తులు ఎక్కవవుతున్నారు. దీంతో మేడారం కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని వరంగల్ లో కాకుండా భక్తులకు అందుబాటులో ఉండేలా మేడారంలోనే ఏర్పాటు చేయాలన్న వాదన వినిపిస్తోంది. ఈ మేరకు రాజకీయ నాయకులుసైతం దేవాదాయ శాఖపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీన్ని సాకుగా చూపుతూ నగరంలో సొంత స్థలంలో నూతనంగా నిర్మించుకున్న ధార్మిక భవన్ లో ఉంటున్న ఈఓ కార్యాలయాన్ని మేడారం తరలించేందుకు దేవాదాయ శాఖ కుట్రలు చేస్తోంది.

## గద్దెలకు తాళం..

ధార్మిక భవన్ నిర్మించిన స్థలం వన దేవతలకు కేటాయించిందని, దీని నుంచి మమ్ములను ఎట్టి పరిస్థితుల్లో పంపించ లేరంటూ సమ్మక్క–సారలమ్మల పూజారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పూజారులు, భాగస్వామ్య వర్గాలు మేడారంలో ఆదివారం సమావేశం నిర్వహించి దేవాదాయ శాఖ, ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. సమ్మక్క–సారలమ్మల ఈఓ కార్యాలయాన్ని తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీనిపై మంత్రి సీతక్క, కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులకు పలు మార్లు వినతిపత్రాలిచ్చినా స్పందన లేకపోవడంపై మండి పడుతున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో అమ్మవార్ల గద్దెలు, ప్రాంగణానికి తాళాలు వేసి, ధర్నా నిర్వహిస్తామని పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

## రేపు మంత్రి సమీక్ష సమావేశం..

మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు, అడిషనల్ కమిషనర్ లు, ఈవోలు తదితరులు పాల్గొనున్నారు.




# ఆ గురుతులు మరిచిపోలేం..

**ఇల్లందలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఆ గురుతులు మరిచిపోలేమంటూ పూర్వ విద్యార్థులు ముక్త ఖంఠంతో ప్రకటించారు. 28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న 75 మంది ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండువగా జరిగింది. అలనాటి గుర్తుగా గురువులతో కలసి విద్యార్థులు పాఠశాలలో మొక్కలునాటారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొన్న బ్యాచ్ మేట్స్ చదువుకునే రోజులను గుర్తుచేసుకుని గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆద్యంతం చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు చురుకుగా పాల్గొన్నారు. అందరూ కలిసి ఆడి, పాడి ఆనందం పంచుకున్నారు. వారి ఆట, పాటలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యయుడు జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, రవికుమార్, శ్రీహరి, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమేష్ బాబు, కత్తి కుమారస్వామి, లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, బీఆర్ఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ప్రముఖ యోగా గురు పోషాల శ్రీనివాస్, శ్రీపాద రాము, నూక శ్రీధర్, కుమ్మం శోభన్ బాబు, ఉపెందర్, నాగరాజు, వేణు, విద్యాసాగర్, వేణు, రాజు, సారంగపాణి, సురేష్, లావణ్య, దీప, లలిత, జీవనజ్యోతి, సునీత, రజిత పాల్గొన్నారు.







## నరేష్ ఉన్నతంగా రాణించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ కరీమాబాద్ లోని అతి సామాన్య కుటుంబంలో జన్మించిన బొనగాని నరేష్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందడం డివిజన్ కే గర్వకారణం అని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అభినందించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన బోనగాని నరేష్ సాగరిక దంపతులను కార్పొరేటర్ మరుపల్ల రవి శాలువా కప్పి బొకే ఇచ్చి సత్కరించారు. పీహెచ్ డీ చేసి నేడు బొనగాని నరేష్ ప్రతిభతో ఫార్మసీ విభాగంలో రాణించడం ద్వారా దేశానికి ఎంతో ఉపయోగపడే వ్యక్తిగా మారడని ఆయన అన్నారు. డివిజన్ లోని విద్యార్థులందరూ ఉన్నత చదువులు చదివి సమాజానికి, దేశానికి ఉపయోగపడే విధంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. సత్కరించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, నాయకులు కోరే కృష్ణ, మరుపల్ల గౌతం, శెట్టి మోహన్, కళ్యాణపు వెంకటేశ్వర్లు, చీర రమేష్, గజ్జి సాంబయ్య, ఇమ్రాన్ లు ఉన్నారు.

## విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బ్రాహ్మణవాడలోని విద్యానికేతన్ హైస్కూల్ 1995-1996 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండలో జరిగింది. సోమవారం ఓ ప్రైవేట్ రెస్టారెంట్ లో ఘనంగా నిర్వహించారు. 28 సంవత్సరాల తర్వాత మిత్రులందరికీ ఒకచోట చేరి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. కష్టసుఖాలను పరస్పరం చెప్పుకున్నారు. ఈ బ్యాచ్ లో విద్యను పూర్తి చేసి అకాల మరణం చెందిన తమ స్నేహితులను గుర్తుచేసుకొని మౌనం పాటించారు. ఒకరికి ఒకరు తోడు కావాలని సమ్మేళనంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసునూటి సుమతి, స్వప్న, శ్రీకాంత్, లక్ష్మణ్, కల్పన, చంద్రవతి, వెంకటేశ్వర్లు, కిషన్, సరళ, సాయి లీల, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ కూలర్లు అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ది. నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండలోని ప్రభుత్వ దివ్యాంగుల ఆశ్రమానికి వృద్ధాశ్రమానికి ఎయిర్ కూలర్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఎన్నో కాంపటీటివ్ పరీక్షలకు, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. వారు సౌకర్యవంతంగా చదువు కోవాలని ఎండ వేడి ఇబ్బంది పెట్ట కూడదని కూలర్లు ఏర్పాటు చేశామని, అందివచ్చిన అవకాశాలు వినియోగించుకొని చక్కగా చదువు కొని వృద్ధిలోకి రావాలని తెలిపారు. దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని, తనకు తోచిన మేర వీరికి సహరించడానికి తాను ఎప్పుడు సిద్ధమేనని, ప్రభుత్వం నుంచి అందవలసిన సౌకర్యాలు, వారి హక్కులు నెరవేరాలని, వారికున్న రిజర్వేషన్ల ప్రకారం వారికి ఉద్యోగాలు అందించాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. విజేందర్, రాజేశ్వర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతా

### ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి అధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ బూత్ ఇంచార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథులుగా తెలంగాణ శాసన సభ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ హాజరయ్యారు. పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతానని వరంగల్ -ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో 100 ఓటర్లకు ఒక ఇంచార్జిని బీజేపీ నియమించింది. ఈరోజు వారందరికీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ హామీలిచ్చి ప్రజలను వెన్నుపోటు పొడవడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే అని, ఈ రెండు పార్టీలకు ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, విద్యార్థుల సమస్యలు పట్టవన్నారు. ఎన్నికల వేళ ఓట్లు వేయించుకునేందుకు అది చేస్తాం, ఇది చేస్తాం అని హామీలివ్వడం తప్పిస్తే వారి అవసరాలను ఏనాడూ పట్టించుకోరని తెలిపారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నేను చిన్నతనంలోనే జాతీయవాదానికి ఆకర్షితుడిడై, అఖిల భారత విద్యార్థి పరిషద్ లో చేరి, విద్యార్థి ఉద్యమాలు, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రులకు సంబంధించిన అనేక రకాల సమస్యలపై పూర్తి అవగాహన, వాటిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఉన్న వ్యక్తిగా నాకు ఒక్క అవకాశం ఇవ్వండని కోరారు. మే 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును సీరియల్ నెం.1లో '1' అంకెరాసి నన్ను ఆశీర్వదించగలరని విజ్ఞప్తి చేశారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, పులి సర్వోతం రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కంధాగట్ల సత్యనారయణ, కార్పొరేటర్ చాడ స్వాతి, జిల్లా నాయకులు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని పోచారం గ్రామానికి చెందిన జూపాక ప్రశాంత్ కు ప్రగతి సింగారం గ్రామానికి చెందిన జ్యోతితో 27న పెద్దల సమక్షంలో రూ.3,50,000 కట్న కానుకలతో వివాహం చేశారు. కొంతకాలంగా ప్రశాంత్ జల్సాలకు అలవాటు పడి అదనపు కట్నం కావాలని జ్యోతిని వేధించేవాడు. కొడుకు ప్రశాంత్ కు మద్దతుగా అతడి తల్లి అహల్య, తండ్రి రవి ముగ్గురు కట్నం కోసం వేధించగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే కళ్యాణ లక్ష్మి పథకం కింద వచ్చిన రూ.1,00,000 అదనపు కట్నంగా ఇచ్చిన ఇంకా కావాలని వేధించడంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో ఈ నెల 18న వీరి ఇంట్లో గొడవ పడగా జ్యోతి తెల్లవారుజామున పెద్ద మనుషుల సమక్షంలో మళ్లీ పంచాయతీ జరుగుతుందని భావించి మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే విషయం తెలుసుకొని పరకాల ఏసీపీ కిషోర్ కుమార్, సీఐ రవి రాజులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏసీపీ కిషోర్ కుమార్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టంపై పరకాల తహసీల్దార్ కు సమాచారం అందిచి దర్యాప్తు ప్రారంభించారు.

## గంగమ్మ తల్లి జాతర వేడుకలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ గుర్తురు గ్రామంలో గంగమ్మ తల్లి జాతర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని గంగపుత్రుల కుటుంబ సభ్యులు ప్రత్యేక ఆకర్షణగా తెల్ల దుస్తులను ధరించి జల బిందలు, మంగళారతులతో డప్పు చప్పుళ్ళు, కోలాటాలు, శివ సత్తులతో నడుమ ఆట పాటలతో నృత్యాలు చేస్తూ గుడి వద్దకు చేరుకొని గంగమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. విగ్రహాలను పండ్లు పూలతో పట్టు వస్త్రాలతో అలంకరించి నైవేద్యాలను సమర్పించారు. కోరికలు తీర్చిన గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ అధ్యక్షుడు పిల్లి నాగరాజు, గంగా పుత్ర సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, సింగరం శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కర్రు కాల్చి వాత పెట్టాలి

### కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కర్రు కాల్చి వాత పెట్టాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూరు లో స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ సభాధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణా రెడ్డిలు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలను ఇచ్చి నిరుద్యోగులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, మేధావులను మోసం చేసి అధికారంలో కొనసాగిన, కొనసాగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు సరైన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రదాని నరేంద్ర మోడీకి కానుకగా అందించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ, విద్యార్థుల పక్షాన గత ముప్పై సంవత్సరాలుగా పోరాడుతున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ప్రజల పక్షాన నిలబడి పోరుబాట పట్టి ప్రశ్నించే గొంతుక అవుతాడని, పట్టభద్రులు విచక్షణతో ఆలోచించి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల అశోక్ రెడ్డి, లేగా రాం మోహన్ రెడ్డి, జిల్లా, మండల నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, పల్లె కుమార్, రంగు రాములు, దొంగరి మహేందర్, దుబ్బ రాజశేఖర్, సుంకరనేని కోటేశ్వర్, రచ్చ కుమార్, సాయిని ఝాన్సీ, మోడపల్లి సోమన్న, అలిసేరి రవిబాబు, గడ్డం నరేందర్, శ్రీకాంత్, చలువాది సత్యనారాయణ, కిన్నెర యాదగిరి, సురేష్, సుధాకర్, రాజేష్, మంగళపల్లి యాకయ్య, గడల శేఖర్, రాజకుమార్, నవీన్, సంతోష్, శివ, రాజు, అనిల్, గణేష్ పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని అరికట్టాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సూర్య ప్రకాష్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల కళాశాలలో ఫీజులో దోపిడీని అరికట్టాలని, అదేవిధంగా ఫీజులో నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గుగులోతు సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని సంఘం కార్యాలయంలో పట్టణ నాయకులు సింహాద్రి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు గూగులోతు సూర్య ప్రకాష్ హాజరై మాట్లాడారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని బడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అడ్మిషన్లు చేయడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదేవిధంగా ఫీజులు హద్దు లేకుండా మితిమీరి పెంచుతున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి జలగలాగా పట్టి పీడిస్తున్నారని, పేద విద్యార్థుల రక్తం తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చెందారు. అదే విధంగా ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుంచి టీసీ, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పాటు జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీంలో సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచితంగా విద్యను అందించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు సింహాద్రి, తరుణ్, పరమేష్, ప్రవీణ్, దినేష్, కార్తీక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్ భద్రత పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఎనుమాముల మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములకు ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు నిర్వహిస్తున్న విధులపై పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు స్ట్రాంగ్ రూమ్ లు, భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పులి రమేష్, సీపీ వెంట ఉన్నారు.

## అరూరిని కలిసిన బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** మండల బీజేపీ నాయకులు సోమవారం హనుమకొండలోని ప్రశాంత్‌నగర్‌లో గల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ ఎంపీ ఎన్నికల్లో కష్టపడి కలిసి కట్టుగా పని చేసిన మీ అందరికీ ధన్యవాదాలు, మీ సమిష్టి కృషి వల్ల జూన్ 4న వచ్చే ఫలితాల్లో అద్భుత విజయం సాధించబోతున్నామని అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుంట ఉపేందర్, సీనియర్ నాయకులు దోమ రవీందర్ రెడ్డి, బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన బొజ్జం రమేష్



**వరంగల్ వాయిస్, పరకాల :** కాంగ్రెస్ సీనియర్ నేత దొమ్మటి సాంబయ్య ఆధ్వర్యంలో పరకాలమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్ఛం అందజేశారు. నరేందర్ రెడ్డి, సాంబయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎలక్షన్లో తీన్మార్ మల్లన్న అధిక మెజార్టీతో గెలిచేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, మాజీ జడ్పీటీసీ బొల్లె భిక్షపతి పాల్గొన్నారు,

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచాలని బీసీ రాజ్యాధికార సమితి జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టడం సరైనది కాదన్నారు. ముందు బీసీ లెక్కలు చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్చిపోవద్దని, ఆ మాటకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ కులాలకు, రాజకీయాలకు అతీతంగా పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు.

## గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్



వరంగల్ వాయిస్, హైదరాబాద్ : ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ అనుమతి లేకుండా అనేక ప్రైవేట్ కార్పొరేట్, పాఠశాలలు జూనియర్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ అన్నారు. జిల్లాల వారీగా అనేక సార్లు జిల్లా డీఈఓలకు, డీఐఈఓలకు వినతి పత్రాల ద్వారా జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా రాష్ట్ర పాఠశాల విద్య శాఖ, ఇంటర్మీడియట్ శాఖ అధికారులు జోక్యం చేసుకొని ఎలాంటి అనుమతి లేని విద్యా సంస్థలను విద్యాశాఖ అధికారులు గుర్తించి ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థుల భవిష్యత్తు ఆగమయ్యే స్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు కొత్తగా ఏర్పడినటువంటి విద్యాసంస్థలలో అడ్మిషన్లు తీసుకుంటున్న క్రమంలో ఆయా విద్యా సంస్థ ప్రభుత్వ గుర్తింపు ఉందా ,లేదా అనే విషయాన్ని గమనించాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థిని మనస్వినికి సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలోని కాశిబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేంద్ర నగర్‌కు చెందిన విద్యార్థి వీరబత్తిని మనస్విని ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 9.8 జీపీఏ ఉత్తీర్ణత సాధించారు. మనస్విని విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమంలో మంచి ప్రతిభను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మైత్రి వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనస్విని, వారి తల్లి తండ్రికి నగదు ప్రోత్సాహం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేరుగు సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైన వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే జీవితంలో విజయం సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కోరుట్ల శ్రీనివాస్, ముదుతనపల్లి రవీందర్, వెనిశెట్టి ప్రశాంత్, అమంచ రవి కుమార్, గడ్డం రవీంద్ర నాథ్, చిందం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం శ్రీవర్షిణిని అభినందించిన దుస్స శివశంకర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** EAPCET-AGRICULTIURE PHARMACY STREAMలో రాష్ట్ర 3వ ర్యాంక్ సాధించిన గడ్డం శ్రీవర్షిణిని హనుమకొండలోని వారి స్వగృహానికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు దుస్స శివశంకర్ ఘనంగా సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు వలుపదాసు శ్యామ్ సుందర్, బొద్దు రాజు, గోనే శివ కుమార్, గుజ్జటి నాగరాజు, మెరుగు భరద్వాజ్, విష్ణుకాయల నాగరాజు, రావల్లి సురేష్, పెండెం రాజేందర్, స్థానిక పద్మశాలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం మేరకు ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఫలితాలు రాగానే జూన్ లో స్థానిక సంస్థల ఎన్నికలు ఆ తరువాత ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సంకేతాలు వెలుబడుతున్నాయన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారన్నారు. బీసీ కులగణన ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన నిర్వహించి ఆయా కులాల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. గత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ తగ్గించి అన్యాయం చేసినందుననే వారి ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోయిన విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం గమనించాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించడంలో కార్పొరేషన్ల చైర్మన్ నియామకంలో బీసీలకు కాంగ్రెస్ తీరని అన్యాయమే చేసిందన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని, జనాభాలో సగభాగానికి పైగా ఉన్నబీసీలకు న్యాయం చేస్తామని రాష్ట్ర నాయకత్వం నుంచిజాతీయ నాయకత్వం వరకు పదేపదే ప్రకటనలు చేస్తున్న ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఓడ దాటే దాక ఓడ మల్లన్న దాటినంక బోడి మల్లన్న లాగా వ్యవహరిస్తే బీసీల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు .

## ఫిషర్ మెన్ వరంగల్ జిల్లా చైర్మన్‌గా సారంగపాణి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** హైదరాబాద్ లో తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన గుడిబోయిన సారంగపాణి గంగపుత్రను తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్ మెన్ మత్స్య విభాగం వరంగల్ జిల్లా చైర్మన్ గా నియమిస్తూ తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి గంగపుత్ర నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా చైర్మన్ గుడిబోయిన సారంగపాణి గంగపుత్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్రకు, తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయి గంగపుత్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక వర్ధన్నపేట శాసన సభ్యుడు కేఆర్ నాగరాజు సహకారంతో మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మత్యకార సంక్షేమ పథకాల పై అవగాహన కల్పిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ నేత ప్రణవ్‌కు ఆత్మీయ స్వాగతం



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ – ఖమ్మం –నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకోసం పరకాల నియోజకవర్గం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో పరకాల పట్టణంలో జరిగే పట్టభద్రుల సమావేశంలో పాల్గొనుటకు విచ్చేసిన పరకాల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వొడితల ప్రణవ్ ను మర్యాద పూర్వకంగా పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు కలిసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ నాయకులు మడికొండ బ్రదర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేయూ పరిధిలో హాస్టళ్ల సందర్శన



**వరంగల్ వాయిస్, కేయూ :** నూతన హాస్టల్ డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య గాదే సమ్మయ్య, విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన వసతి, భోజన సౌకర్యాలను పరివేక్షించేందుకు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మొదట కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ ను సందర్శించి భోజన సౌకర్యం, హాస్టల్ సౌకర్యాలను పరీక్షించారు. అదేవిధంగా వెంటనే కామన్ మెస్ సందర్శించి విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తూ విద్యార్థులతో హాస్టల్ వసతులను, భోజన నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యవేక్షణలో నాణ్యతలేని టమాటాలను ,అల్లంను తిరస్కరించి నాణ్యత గల కూరగాయలను, పాలు, పెరుగు, గుడ్లు, చికెన్ మొదలగు వాటిని నాణ్యమైన వాటిని సరఫరా చేయవలసిందిగా సరఫరాదారులతో మాట్లాడారు. నాణ్యతను, అక్యురసిని పరిశీలించి వాటిని వినియోగించే బాధ్యత, తోసిపుచ్చే బాధ్యత మొదటగా మెస్ కమిటీ మెంబర్లపై ఉంటుందన్నారు. ఆ తర్వాత కేర్ టేకర్స్ పైన ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సమీపంలో ఉన్న లా హాస్టల్ ను సందర్శించి విద్యార్థులతో హాస్టల్ వసతులు ,భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో చివరగా డాక్టర్ రాధిక (జాయింట్ డైరెక్టర్), డైరెక్టర్ సమ్మయ్య, పద్మాక్షి లేడీస్ హాస్టల్ ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మీ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు.

## ఏసీబీకి చిక్కిన తహసీల్దార్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ నిర్వహించిన దాడుల్లో తహసీల్దార్ మాధవితోపాటు ధరణి ఆపరేటర్ రాకేష్ రెడ్ హ్యాండెడ్ గా చిక్కారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం కమలాపూర్ మండలంలోని కన్నూరు గ్రామానికి చెందిన కసరబోయిన గోపాల్ దగ్గర విరాసత్ రిజిస్ట్రేషన్ కోసం రూ. 30వేలు ఇవ్వాలంటూ తహసీల్దార్ డిమాండ్ చేశారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ మాధవిరూ. 4వేలు, ధరణి ఆపరేటర్ రూ. వెయ్యి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 22న అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్నిపురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్ లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జీవవైవిధ్య మండలి తెలంగాణ ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక, వనసేవా సొసైటీ, ఇతర హరిత సంస్థల అధ్వర్యంలో జీవ వైవిధ్య సంరక్షణ ప్రణాళికలో భాగస్వాములమవుదామనే అంశంతో ప్రజలకు అవగాహన కల్పించి వారు సహజ , రసాయన, ప్లాస్టిక్ రహిత ఉత్పత్తుల వినియోగం చేసే విధంగా చైతన్య పరచడానికి మే 22 బుధవారం ఉదయం 9-00 గంటలనుండి 1-00 వరకు "సదస్సు" ప్రకృతి మిత్ర, సేంద్రియ సాగు, పండ్లు, సిరిధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన -విక్రయాల "మేళా" ఉదయం 7-00 గంటల నుంచి సాయంత్రం 7-00 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ఇండియా గ్రీన్ హార్ట్/ ఫారెస్ట్ మాన్ ఆఫ్ తెలంగాణ, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశర్ల సత్యనారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు. స్థానిక అటవీ, పోలీస్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులు, జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ సభ్యులు, పింగళి మహిళా కళాశాల విద్యార్థినులు పాల్గొననున్నారు. ఈ హరిత చైతన్య కార్యక్రమానికి అధిక సంఖ్యలో పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేసుకోడానికి మరిన్ని వివరాలకు మొబైల్ 8328026266 లో గానీ, 9948609591 లను సంప్రదించాలని పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక సమావేశంలో (యూఎఫ్ ఈపీ)అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి టి శ్రవణ్ కుమార్ లు కోరారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు పరికిపండ్ల వేణు, కె.దామోదర్, శ్యామ్ సుందర్ శర్మ, సుధాకర స్వామి, రాజకుమార్, వకులాభరణం శ్రీనివాస్, ధర్మప్రకాశ్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

### డీఎంహెచ్ఓ కళావతి భాయి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు విచ్చేసే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి పేర్కొన్నారు. కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఈదుల పూసలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సిబ్బందికి తగిన ఆదేశాలు సూచనలు చేశారు. 12 వారాల్లోపు గర్భిణీ స్త్రీలను నమోదు చేయాలని, గర్భిణీ స్త్రీలకు మొదటి, రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో చేయించాలని, మూడు నాలుగు పరీక్షలు జిల్లాలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో ఉన్న స్త్రీ వైద్య నిపుణులతో చేయించుకునేలా అవగాహన కల్పించాలని, సి-సెక్షన్ల ప్రసవాలను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచే విదంగా ప్రజలలో అవగాహన కల్పించాలని, ఔట్ పేషెంట్ సేవలను మెరుగు పరుచాలని ఆమె తెలిపారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న గర్భస్రావాల పైన నిఘా ఉంచాలని, ముఖ్యంగా ముందు కాన్పులో ఆడపిల్ల ఉండి మళ్ళీ గర్భం ధరించి 14 వారాల తదుపరి గర్భస్రావం జరిగినట్లయితే అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధుల కోసం 30 సంవత్సరాలు పైబడిన వారిని స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి మందులను అందించాలని, వ్యాధి నిరోధక టీకాలు 100 శాతం టార్గెట్ పూర్తిచేయాలని పేర్కొనడం జరిగింది. ఆర్.బీఎస్ కే వైద్యాధికారులు, సిబ్బంది తమ అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారంగా విధులు నిర్వహించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ కొప్పు ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సౌజన్య, ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మ, సరిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్పీచ్ థెరపీ మొబైల్ యాప్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య ఆరోగ్యశాఖ ఎంజీఎంలోని డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లో స్పీచ్ థెరపీ(లాంగ్వేజ్ డిలే) మొబైల్ యాప్ ను సోమవారం ఆవిష్కరించారు. ఈ యాప్ ను ఎన్ఐటీ కాలేజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ ఆదర్శ రావు, సయ్యద్ ఫర్జానుద్దీన్ డిపార్ట్ మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ డాక్టర్ కె.వి కతంబరి డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కు అందజేశారు. ఈ యాప్ ద్వారా స్పీచ్ తెరపి వారికి చాలా సులభంగా తెరఫీ చేయుటకు అనుకూలంగా ఉంటుందని డాక్టర్ కదంబరి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇమినైజేషన్ అధికారి డాక్టర్ ఐ.ప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి యాప్స్ ద్వారా ఇంటలెక్చువల్ డిజబులిటీ గలవారికి త్వరితగతిన స్పీచ్ థెరపీ చేయవచ్చని, భవిష్యత్తులో ఇలాంటి యాప్స్ ద్వారా పేద, మధ్య తరగతి పిల్లలకు అందుబాటులోకి తెస్తే ఎంతో మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యాప్ ద్వారా స్పీచ్ థెరపీ ఈజీగా ఉంటుందని ఆడియాలజిస్ట్ వనజ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్. ఐ.ప్రకాష్, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలక్ష్మి, వనజ, వరంగల్ డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (ఎంజీఎం) డైక్ మేనేజర్ మెరుగు అనిల్ కుమార్ , ఫిజియోథెరపీస్ట్ పవన్, ప్రశాంత్, డెంటల్ టెక్నీషియన్ నూర సంపత్ కుమార్, రమేష్, సోషల్ వర్కర్ లావణ్య, అమూల్య, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

### కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్– ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల స్థానంలో మొదటిసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయబోతున్నామని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పట్టభద్రులు, మేధావులు తమ పార్టీ వైపే ఉన్నారన్నారు. పరకాల నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ వొడితల ప్రణవ్ తో పాటు నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల, పట్టణ, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్నను విజయాన్ని కాంక్షిస్తూ తీన్మార్ మల్లన్నకు మద్దతుగా పరకాల పట్టణం వెల్లంపల్లి రోడ్ లోని మహాదేవ్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, పట్టభద్రుల ఓటర్లను స్వయంగా కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేయాలని కోరారు. మల్లన్నకు పరకాల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ రావాలన్నారు.

సోమవారం 20, మే 2024
www.warangalvoice.net

# ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు లోకల్ బాడీస్, రెవెన్యూ లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్ లతో కలిసి సంబంధిత నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4 నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారి పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని నియమించాలన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్స్ వంటి మెటీరియల్ సిద్ధం చేయాలని మెటీరియల్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారికి సూచించారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేపట్టాలని, సిబ్బంది పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశ మార్గాలు, సూచికల బోర్డ్ లు ఏర్పాటు చేయాలని, పాత్రికేయుల కోసం మీడియా సెంటర్ లో అవసరమైన చర్యలు చేపట్టాలని, కౌంటింగ్ సిబ్బంది వాహనాల పార్కింగ్ కు స్థలాన్ని పరిశీలించాలని, అధికారుల మొబైల్ ఫోన్స్ డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. 27న జరగనున్న వరంగల్ -ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల పోలింగ్ కు జిల్లాలోని 34,933 ఓటర్లకు గాను 36 పోలింగ్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని, సెక్టార్ అధికారులు ప్రతీ పోలింగ్ స్టేషన్ ను తనిఖీ చేయాలని ఏవైనా సమస్యలు ఉంటే త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఉన్న 58 బ్యాలెట్ బాక్స్ లను పోలింగ్ కు సిద్ధం చేయాలని, తొర్రూరు జడ్పీహెచ్ఎస్, మహబూబాబాద్ ఫాతిమా హైస్కూలులో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు ఎల్.అలివేలు, నరసింహారావు, డిప్యూటీ సీఈఓ నర్మద, మత్స్య శాఖ అధికారిణి నాగవాణి, డీఏఓ హరిప్రసాద్, సీపీఓ సుబ్బారావు, డీడీ గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి నరసింహమూర్తి, తహసీల్దార్లు సైదులు, భగవాన్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ రాములు, ప్రవీణ్, ఎన్నికల విభాగం సిబ్బంది గణేష్, సందీప్, రంజిత్ పాల్గొన్నారు.

## సకాలంలో ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ పి.శ్రీజ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థలు పి.శ్రీజ డీఆర్ డీఏ శ్రీనివాస్ కుమార్ తో కలిసి ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనిలో కూలీల సంఖ్య పెంచే విధంగా చూడాలని, దినసరి వేతనం రూ.250 కల్పించే విధంగా చూడాలన్నారు. ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని, అర్హతలు ఉన్న వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను ఫీల్డ్ కు వెళ్లి తనిఖీ చేయాలని , ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీల లెక్కలు ఉండాలని, ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు తాగునీరు, ఎండ వేడిమి తగలకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకట నారాయణ, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తలసేమియా బాధితులను కాపాడేందుకు వీవీయన్ స్వామి నాయుడు పుట్టిన రోజు సందర్భంగా చెన్నై సిల్క్స్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ లో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్త దాన శిబిరానికి ముఖ్య అతిధిగా హనుమకొండ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ హాజరై రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా వచ్చిన వరంగల్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ మాట్లాడుతూ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అభినందించారు. తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన చెన్నై సిల్క్స్ ఎంప్లాయిస్ కు కృతజ్ఞతలు తెలిపారు.రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డా.మొహమ్మద్ తహర్ మసూద్, పి.శేషు కుమార్, కె.రాజేష్ కుమార్, గాజుల రాఘవ కృష్ణ, డి.నరేష్, ఎండీ. జమీల్ అహ్మద్, సతీష్ కర్ణాకర్, రెడ్ క్రాస్ సిబ్బంది జి.శ్రీనివాస్, గుల్లెపెల్లి శివ కుమార్, బి.పవన్, బి.అనిల్, జి.సునీత, కె.రమేష్, పోశాలు, చెన్నై సిల్క్స్ ఎంప్లాయిస్, రక్తదాతలు పాల్గొన్నారు.

## స్నేహితురాలి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, రేగొండ :** తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్నిఅందజేసి గోరి కొత్తపల్లి మండల పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధం గొప్పతనాన్ని చాటారు. స్నేహితులు అంటే సంతోషాలలో కలిసి ఉండటమే కాకుండా కష్టాలలో సైతం మేమున్నామనే భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే గోరికొత్తపల్లిలో పదవ తరగతి 2007 బ్యాచ్ కు చెందిన కట్ల సృజన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న 2007 పదో తరగతి విద్యార్థులు ఆదివారం మృతురాలు కట్ల సృజన సంతానమైన ఇద్దరు ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. సృజన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. తోటి స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొనడం పట్ల గ్రామస్తులు వారిని అభినందించారు. సృజనకు ఆర్థిక సాయం అందించిన వారిలో నిమ్మల శంకర్, పల్లెబోయిన నవీన్, నెల్లి ప్రశాంత్, బోడకుంట్ల కృష్ణ, కర్నె చిరంజీవి, నంది విజయ్, గజ్జి నాగరాజు, కుడ్లె నరసింగం, పెర్వాల ప్రభాకర్, కట్ల రమేష్, సాదు సుదర్శన్, బొమ్మకంటి సతీష్, పుట్ట రమేష్, వనంచంద్రమౌళి, సూరం కల్యాణి, దాసరి కల్యాణి, బోడకుంట్ల హరిత, ఆవుల మాధవి, భట్టు సరిత పాల్గొన్నారు.

## రహదారిపై మొక్కజొన్నలు ఆరబోయొద్దు

### దామెర ఎస్సై కొంక అశోక్



**వరంగల్ వాయిస్, దామెర :** రహదారులపై మొక్కజొన్నలు ఆరబోయొద్దని దామెర ఎస్సై కొంక అశోక్ రైతులకు సూచించారు. దామెర నుంచి ల్యాదళ్ల వెళ్లే రహదారిపై ధాన్యం పోసిన ప్రదేశాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. రహదారిపై మొక్కజొన్నలు, ధాన్యాన్ని అరబోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రహదారులపై నుంచి తొలగించి, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబోసుకోవాలని సూచించారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

# గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించండి

## బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి కాళీ ప్రసాద్



**వరంగల్ వాయిస్, పరకాల :** ఈనెల 27న జరిగే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రులు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పరకాల నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షతన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కాళీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో నరేంద్ర మోడికి గత లోక్ సభ ఎన్నికల్లో విశేష ఆదరణ లభించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 ఎంపీ సీట్లకు పైగా గెలవబోతున్నట్లు అభిప్రాయపడ్డారు. ప్రధానంగా వరంగల్ లోక్ సభ స్థానంలో 2 లక్షల మెజార్టీతో గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తులో వాటిని నెరవేర్చే దాఖలాలు కానరావడం లేదన్నారు. అకాల వర్షాల కారణంగా పంటచేళ్లలో వరి ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ప్రతి కింటాకు రూ.500ల బోనస్ కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనట్లయితే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీఅభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు పట్టభద్రులకు ఓటు వేయడం మూలంగా నిరుద్యోగ ఉద్యోగ సమస్యలపై వీరు పెద్దల సభలో ప్రశ్నించే అవకాశం లేదన్నారు. భవిష్యత్తులో నిరుద్యోగ సమస్యపై, ఉద్యోగుల సమస్యలపై ప్రజా సమస్యలపై శాసనమండలిలో చర్చకు రావాలంటే బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రుల సరైన నిర్ణయం తీసుకొని ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంతి లాల్, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ మేకల రాజా వీరు, కార్యదర్శి ఎర్రం రామన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజ భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షులు సంఘ పురుషోత్తం, మహిళా మోర్చా అధ్యక్షురాలు వెలిశెట్టి శారద తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కు

### అందజేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆకస్మికంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే అర్మ్ డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పుట్టా మధు గత ఫిబ్రవరి 3న అనారోగ్యంతో మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి మంజూరు చేసిన రూ.7లక్షల 89 వేల చెక్కులను పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మరణించిన కానిస్టేబుల్ సతీమణికి అందజేశారు. ఈ సందర్భంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబ స్థితిగతులపై ఆరా తీయడంతో పాటు, శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్లను అందజేసేందుకు తక్షణ చర్యలు గైకొనాల్సిందిగా పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, పరిపాలనాధికారి రామకృష్ణ స్వామి, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 20, మే 2024


# మగబిడ్డకు జన్మనిచ్చిన యామీగౌతమి

## వేదవిద్ పేరు పెట్టామంటూ ప్రకటన



నటి యామి గౌతమ్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె భర్త ఆదిత్యాధార్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆ బాబుకు 'వేదవిద్' అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. ఆయన పోస్ట్‌కు నెటిజన్లు శుభాకాంక్షలతో కామెంట్లు చేస్తున్నారు. 'యామి గౌతమ్ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్షయ తృతీయ లాంటి పర్వదినాన మాకు మగ బిడ్డ పుట్టాడు. మరొక అందమైన ప్రయాణాన్ని ప్రారంభించాం. అందరి ఆశీస్సులతో మా కుమారుడికి గొప్ప భవిష్యత్తు ఉండాలని కలలు కంటున్నాం. అతడు ఎన్నో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాం. మా కుటుంబానికి అలాగే దేశానికి గర్వకారణమయ్యేలా ఎదగాలని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. అలాగే ఆస్పత్రిలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. యామి-ఆదిత్య ధార్ 2021లో పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. 'నువ్విలా'తో తెలుగు తెరకు పరిచయమైన యామి గౌతమ్ పలు బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యారు. అదే సమయంలో 'గౌరవం', 'యుద్ధం', 'కొరియర్ బాయ్ కల్యాణ్' చిత్రాలతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరించారు. ఇటీవల ఆమె నటించిన 'ఆర్టికల్ 370' ఈవెంట్‌లో తల్లికానున్నట్లు ప్రకటించారు.

# హేమ వీడియో బుకాయింపు

## కోడై కూస్తున్న కన్నడ మీడియా



బెంగళూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటి హేమ ఉన్నట్లు వార్తలు రావడంతో ఆమె వెంటనే ఓ వీడియో వదిలి నేనక్కడ లేను..హైదరాబాద్‌లోనే ఉన్నానంటూ బుకాయించింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఆమె బెంగళూరులోని జీఆర్ ఫామ్‌హౌస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. నిజంగానే హేమ అక్కడే ఉందని కన్నడ మీడియా కోడై కూస్తోంది. కన్నడ మీడియాకు హేమ ఫొటో లభించిందని, అదే డ్రెస్‌లో హేమ విడుదల చేసిన వీడియో ఉందని సమాచారం. సోమవారం ఉదయం ఆమె ఓ వీడియో విడుదల చేసి, తాను హైదరాబాదులోనే ఉన్నానంటూ బెంగుళూరు రేవ్ పార్టీకి తనకు సంబంధం లేదని బుకాయిస్తూ ఓ వీడియోలో పేర్కొంది. కానీ సదరు వీడియో సైతం బెంగుళూరు ఫామ్‌హౌస్‌లోనే ఓ పక్కకి వెళ్లి హేమ రికార్డ్ చేసినట్లు సమాచారం. హేమతోపాటు ఆమె స్నేహితుడు చిరంజీవిని పోలీసులు అరెస్ట్ చేశారని తెలిసింది. ఈ రేవ్‌పార్టీలో దాదాపు 100 మంది సభ్యులు ఉన్నారని, అందులో అబ్బాయిలు 70, అమ్మాయిలు 30 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి రక్త నమూనాలను, హెయిర్ శాంపిల్స్ సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు. నేటి సాయంత్రం లోపు అక్కడ ఏం జరిగింది, ఎవరెవరు ఉన్నారన్నది పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.



## ఇక మరింత బిజీగా నటి రష్మిక

ప్రస్తుతం రష్మిక మందన్నా క్రేజ్‌ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. మిగతా హీరోయిన్స్ ఆమె దరిదాపుల్లో కూడా లేరు. ఒకటి కాదు రెండు కాదు.. ఆమె చేతిలో ప్రస్తుతం తొమ్మిది క్రేజీ సినిమాలు ఉన్నాయి. అందులో టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ ఇలా ప్రతీ ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ మిగతా హీరోయిన్స్‌కి గట్టి పోటీని ఇస్తోంది. రష్మిక చేస్తున్న మోస్ట్ వాంటెడ్ సినిమాల్లో పుష్ప ఒకటి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా తరువాత ధనుష్ ప్రధాన ప్రాత్రలో వస్తున్న కుబేర సినిమాలో నటిస్తోంది. తెలుగు దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో కింగ్ నాగార్జున కూడా కీ రోల్ చేస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో వస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రౌడీ హీరో విజయ్ దేవరకొండతో కూడా మరో సినిమా చేస్తోంది. దిల్ రాజు నిర్మాణంలో రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఇటీవలే లాంఛనంగా మొదలయింది. చిలసౌ ఫేమ్ దర్శకుడు రాహుల్ రవీంద్ర తెరకెక్కిస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది రష్మిక. గీత ఆర్ట్స్ నిర్మిస్తున్న తమిళ దర్శకుడు సిబి చక్రవర్తి నేచురల్ స్టార్ నానితో ఓ సినిమా చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇక తమిళ్ విషయానికి వస్తే అక్కడ కూడా వరుస సినిమాలు చేస్తోంది రష్మిక.. అక్కడ ముందుగా సూర్య హీరోగా స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్ గా రష్మిక నటిస్తోందట. ఇక శివ కార్తికేయన్ హీరోగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ చేస్తున్న సినిమాలో కూడా రశ్మికనే హీరోయిన్. ఇక హిందీలో కూడా రష్మిక బంపర్ ఆఫర్ కొట్టేసింది. ఇప్పటికే ఆమె హిందీలో చవా సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తరువాత బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తో సినిమా చేసే అవకాశం దక్కించుకుంది రష్మిక. సల్మాన్ ఖాన్ హీరోగా తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ సికిందర్ అనే పాన్ ఇండియా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇలా వరుసగా సినిమాలు చేస్తూ.. మిగతా హీరోయిన్స్ టచ్ చేయలేని రేంజ్ లో ఉంది రష్మిక.

# ఎనిమిదేళ్ల తరవాత దర్శనం

## మిరాయి సినిమాతో మంచు మనోజ్



సుమారు ఎనిమిది సంవత్సరాల విరామం తరువాత మంచు మనోజ్ వెండితెరపై కనిపించనున్నారు. అదే విషయాన్ని మనోజ్ తన పుట్టినరోజైన మే 20పురస్కరించుకున తన అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'మిరాయి' సినిమా నుండి మనోజ్ పాత్ర చిత్రాన్ని ఈరోజు విడుదల చేశారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకుడు, తేజ సజ్జ ప్రధాన పాత్ర పోషిస్తున్న, ఈ సినిమాని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఈ సందర్భంగా మంచు మనోజ్ తన అభిమానులను ఉద్దేశించి ఒక భావోద్వేగ మాటలు చెప్పారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు అయింది, నేను సినిమాలు చేసి. 'ఎందుకంటే నాకు మెయిన్ అమ్మ అంటే సినిమా, మీరందరూ నాపై ఇంత ప్రేమ చూపిస్తున్నారు అంటే అది సినిమా వల్లే కదా. అందుకే నేను సినిమా చెయ్యాలి అనుకొని గత మూడు నాలుగు సంవత్సరాల నుండి కథలు వింటూ వస్తున్నాను. నాకు ఏదైనా కొత్తగా చెయ్యాలి, ఏది చేసినా మనస్ఫూర్తిగా చెయ్యాలి, సినిమా కేవలం డబ్బు కోసం మాత్రమే కాదు, నాకు సినిమా నచ్చి, కథ నచ్చి చెయ్యాలని అలా వెతుక్కుంటూ వెళ్లాను,' అని చెప్పారు మనోజ్. 'నేను సినిమాలు మళ్ళీ చేద్దాం అనుకున్న సమయంలో ఎన్నో కథలు వచ్చాయి, వింటూ వున్నాను. అందులో కొన్ని నచ్చాయి కానీ అవి ఏవో కారణాలతో కుదరలేదు, నాకు కొన్ని నచ్చలేదు, నిరాశ పడ్డాను, వేచి చూసాను, ఓపిక అంటే ఏంటో తెలుసుకున్నాను, అప్పుడు ఓపిక విలువ ఏంటో కూడా తెలుసుకున్నాను,' అని చెప్పారు మనోజ్. ఆ సమయంలో దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని గారు వచ్చారు, అలాగే తేజ సజ్జ కి కూడా థాంక్స్ చెప్పాలి, ఎందుకంటే అతనే ఈ కథని నా దగ్గరకి పంపి ఒక్కసారి విను అని చెప్పాడు. నువ్వు నేను కలిసి చెయ్యాలి, స్క్రిప్ట్ వినాలి అని చెప్పారు తేజ సజ్జ. ఇది అదిరిపోయే స్క్రిప్ట్, రెండు భాగాలుగా వస్తుంది, పార్టు వన్, పార్టు 2 లలో వస్తుంది, మొదటి పార్టు ఏప్రిల్ 18, 2025లో విడుదలవుతుంది, ఇంతకంటే ఈ సినిమా గురించి నేను ఎక్కువ చెప్పకూడదు, అని తన గురించి చెప్పారు మనోజ్. జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు కూడా ఇవాళే.. అందుకే తన మిత్రుడు తారక్ కి పుట్టినరోజు శుభాకాంక్షురాలు తెలిపారు మనోజ్. 'దేవర లో పాట విడుదలైంది, అదిరిపోయింది. నువ్వు ఎక్కడున్నా చల్లగా హాయిగా వుంది బాబాయ్', అని జూనియర్ ఎన్టీఆర్ కి శుభాకాంక్షలు చెప్పారు మనోజ్. అలాగే ఈరోజు 'కన్నప్ప' టీము కూడా టీజర్ లాంచ్ చేస్తున్నారని, తన అన్న విష్ణుకి, టీముకి విషెస్ తెలియచేసారు మనోజ్. సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి పుట్టినరోజు కూడా ఈరోజే, ఆయన్ని మిస్ అవుతున్నాం, అతని దీవెనలు ఉండాలి మనకి అని తన మాటలను ముగించారు మనోజ్.




# కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం..

# శ్రీ మత్స్యగిరి స్వామి



### కాకతీయుల కళావైభవానికి ప్రతీక
### రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** భక్తులు పిలిచిన వెంటనే పలికి వారి కోర్కెలు తీర్చే కలియుగ దైవం శ్రీ మత్స్యగిరి స్వామి. శాయంపేట మండల కేంద్రంలోని ఈ మత్స్యగిరి స్వామి ఆలయం కాకతీయుల కళావైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. రాష్ట్రంలోనే రెండో మత్స్యగిరి స్వామి పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచింది. స్వామి వారికి ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి పంచమ రాత్రి ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీ మత్స్యగిరి స్వామి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ క్రమంలో మంగళవారం 21నుంచి శనివారం 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### ఆలయ చరిత్ర..

శాయంపేట గ్రామ పొలిమేరలోని మచ్చర్లగుట్టపై శ్రీ మత్స్యగిరి స్వామి ఆరు శతాబ్దాల క్రితం అంటే 568 సంవత్సరాల క్రితం కొలువుదీరినట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. మహావిష్ణువు దుష్టశిక్షణకై దశావతారాలలో భాగంగా మొదట మత్స్యావతారంగా వెలసినట్లు చెబుతున్నారు. మచ్చర్లయ్యగుట్ట వద్ద గ్రామ్య భాషలో శాలివాహన శకంలో వేయించిన శిలాశాసనం ద్వారా ఆనాటి దేవాలయ చరిత్ర తెలుస్తోంది. గుట్ట లోపల బండరాయిపై సహజ సిద్ధంగా చేప అవతారంలో స్వామి వారు దర్శనమిస్తున్నారు. ఇక్కడ 14 దేవాలయాలు 24 మంది అర్చకులు ఉండేవారని ఈ శిలా శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ గుట్ట లోపటికి వెళ్లేందుకు ఒకే ఒక చిన్న మార్గం ఉంటుంది. అప్పుడు నిర్మించిన చెరువు నేటికీ అదే దేవుని చెరువు పేరుతో పిలువబడుతోంది. అయితే కాకతీయ సామంత రాజు కొత్త గట్టు సీమ పాలకుడు రేచర్ల దర్శనాయుడు తన తల్లిదండ్రులు సింగమాంబ-సింగమ నాయుడు దేవాలయం నిర్మించినట్లు తెలుస్తోంది. కాలక్రమంలో మచ్చర్లయ్య గుట్ట వద్ద నుంచి గ్రామం దూరంగా వెళ్లిపోవడంతో గ్రామం మధ్యలో రాతితో శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయాన్ని నిర్మించారు. దేవాలయ గోపురం పైన మహావిష్ణువు దశావతారాలు భక్తులకు దర్శనమిస్తాయి.



### 22న కల్యాణోత్సవం..

ఈనెల 21న శ్రీ మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు మంగళవారం ఉదయం తోలక్కం, పుట్ట బంగారు సేవ మధ్యాహ్నం ధ్వజారోహణం, గరుడ ముద్దా సాయంత్రం ఎదురుకోళ్లు నిర్వహించనున్నారు. కాగా సంతానం లేని దంపతులు గరుడ ముద్ద ప్రసాదం స్వీకరించడం ద్వారా సంతానం పొందుతారని ప్రతీతి. 22వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు అశేషంగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహా అన్నదానం చేయనున్నారు. 23వ తేదీ గురువారం ఉదయం పూర్ణాహుతి సాయంత్రం 6 గంటలకు గజవాహన సేవ, గుట్టమీదికి పోవడం, 24వ తేదీ శుక్రవారం సాయంత్రం రథోత్సవం, అలుకతీరుట, 25వ తేదీ శనివారం ఉదయం చక్ర వరీ, సాయంత్రం నాకబలి, నాగవల్లి, పండిత సన్మానంతో ఉత్సవాలు ముగిస్తాయని దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు.

# జర్నలిస్టులకు క్రీడా పోటీలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులైన జర్నలిస్టు మిత్రులకు ఆటవిడుపు, ఉల్లాసం కోసం క్రీడా పోటీలు నిర్వహించాలని ప్రెస్ క్లబ్ కమిటీ నిర్ణయించింది. క్రికెట్, వాలీబాల్, క్యారం, చెస్, షటిల్ లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ లు సోమవారం ప్రకటించారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న జర్నలిస్టులు మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు (మే 21 నుంచి 24 వరకు)ప్రెస్ క్లబ్ కి వచ్చి నేరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అన్ని క్రీడాంశాలకు సంబంధించి జర్నలిస్టులు (చెస్ మినహా) జట్టులవారిగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గడువులోగా పేర్లు నమోదు చేసుకోని వారికి క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. పేర్ల నమోదు అనంతరం క్రీడాంశాల వారీగా డ్రాలు తీసి పేర్లను ప్రెస్ క్లబ్ నోటీస్ బోర్డుపై అంటించడం జరుగుతుందని వెల్లడించారు. ఆ తదుపరి క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు.





# ఘనంగా చక్రస్నానం

### సుసంపన్నమైన భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు
### ఉభయ దాతలుగా వ్యవహరించిన పద్మశాలీలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని సుప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో గత 11 రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం చక్ర తీర్థోత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణం ఘటాభిషేకం, పుష్పయాగంతో సుసంపన్నమయ్యాయి. అమ్మవారికి ఉదయం నాలుగు గంటలకు నిత్యానికం, స్నపన విధి విశేష పూజాధికాములు, చూర్ణోత్సవం ఘనంగా జరిపించారు. ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు నేతృత్వంలో ఆలయ పార్శ్వరంలోని భద్రకాళి తటాకంలో చక్రతీర్థోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భేరీతాడనం జరిపి ధ్వజావరోహణం చేశారు. అనంతరం నిర్వహించిన పుష్పయాగంలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయ దాతలుగా వరంగల్, హనుమకొండ, గ్రేటర్ వరంగల్ పద్మశాలి సంఘం వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖ వ్యాపారవేత్త గుండు ప్రభాకర్, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ జడ్పీ చైర్మన్ సాంబార్ సాంబారావు, జిల్లా అధ్యక్షులు ఆడేపు రవీందర్, ప్రధాన కార్యదర్శి గోరంట రాజు, వడ్నాల రవీందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, శామంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈవో శేషు భారతి మాట్లాడుతూ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికార అనధికార ప్రముఖులు, దాతలు, భక్తులు, కుల సంఘాలు ముఖ్యంగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా వారికి ధన్యవాదాలు తెలిపారు.

# నగరంలో హాశిష్ మత్తు మందు

### పోలీసులకు పట్టుబడిన అంతర్ రాష్ట్ర స్మగ్లర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అతి ప్రమాదకమైన హాశిష్ మత్తు మందు స్మగ్లింగ్ కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్ ను మట్టేవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడు నుంచి సుమారు రూ. 4.50 లక్షల విలువైన గంజాయి ఆకుతో తయారు చేసిన 900 గ్రాముల హాశిష్ మత్తు పదార్థాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ కు సంబంధించి వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ వివరాలను వెల్లడించారు. కాకినాడ జిల్లా, ఏళేశ్వరం ఎర్రవరంకు చెందిన అంతర్ రాష్ట్ర స్మగ్లర్ చింతల వెంకట రాజు అలియాస్ బాబీ ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థంతో హంటర్ రోడ్ లోని ఏడు మోరీల ప్రాంతంలో అనుమానస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మట్టేవాడ పోలీసులు, తెలంగాణ నార్కోటిక్ అనాలాసిస్ విభాగం అధికారులతో కలిసి మత్తు పదార్థాన్ని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా నిందితుడి వద్ద నిషేధిత మత్తు పదార్థం హాశిష్ గుర్తించారు. వెంటనే మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టేవాడ సీఐ తుమ్మ గోపి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com